క్లుప్తంగా

పంచాయతీ కార్మికులకు దుస్తుల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో పంచాయతీ, పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివని జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ అన్నారు. హుకుంపేట మాజీ ఉప సర్పంచ్, జనసేన ప్రోగ్రామ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ చిక్కాల వీర వెంకట రమణ (బాబులు) నివాసంలో సంక్రాంతిని పురస్కరించుకుని పంచాయతీ, పారిశుద్ధ్య కార్మికులకు కందుల దుర్గేష్ చేతుల మీదుగా దుస్తులు పంపిణీ చేశారు.

అమ్మవార్లకు మకర తోరణం సమర్పణ



గ్రామ దేవతలకు మకరతోరణాన్ని అలంకరిస్తున్న చంటి, కుటుంబ సభ్యులు

కడియం: మాధవరాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి, మాజీ ఎంపీపీ విజయ దంపతులు గ్రామ దేవతలైన మునలమ్మ, సోమాలమ్మకు మకణ తోరణం సమర్పించారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో చంటి దంపతులు కుటుంబ సమేతంగా వీటిని అమ్మవార్లకు అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నర్సరీ సందర్శన



శైలజానాథ్‌కు స్వాగతం పలుకుతున్న చిన సత్యనారాయణ

కడియం: కడియపులంకలోని సత్యదేవ నర్సరీని కాంగ్రెస్ నాయకుడు, పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ సందర్శించారు. ఆయనకు నర్సరీ రైతు పుల్లా చిన సత్యనారాయణ మొక్కను అందించి, శాలువా వేసి స్వాగతం పలికారు. వివిధ రకాల మొక్కలను వివరించారు. కడియం ప్రాంత నర్సరీ రైతుల నైపుణ్యాన్ని ఈ సందర్భంగా శైలజానాథ్ అభినందించారు.

వైభవంగా చింతాలమ్మ తీర్థం



ప్రత్యేక అలంకరణలో చింతాలమ్మ

కడియం: దుళ్ల శివార్లలోని చింతాలమ్మ తీర్థ మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. కనుమ పండగ రోజు అమ్మవారి తీర్థం నిర్వహించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో కడియం మండలంతో పాటు మండపేట రూరల్, ఆలమూరు, మండపేట మండలాల నుంచి భక్తులు భారీ ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద భారీ సెట్టింగులు, సాంస్కృతిక కార్యక్రమాలను ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

ఆధ్యాత్మిక సంపద గొప్పది



మాట్లాడుతున్న డాక్టర్ కర్రి రామారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: భౌతిక సంపదల కన్నా ఆధ్యాత్మిక సంపద ఎంతో గొప్పదని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నగర సంచాలక్ కర్రి రామారెడ్డి అన్నారు. సంక్రాంతి సందర్భంగా ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో త్యాగరాజ నారాయణదాస సేవాసమితి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సంస్కృత భారతి దక్షిణ మధ్య క్షేత్ర (ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక) అధ్యక్షుడు ఆచార్య దోర్బల ప్రభాకర శర్మ మాట్లాడుతూ సంక్రాంతి పండగ రోజు సకల పాపాలను హరించే గోదావరిలో స్నానం చేయడం అత్యంత శ్రేయస్కరం అన్నారు. అనంతరం భోగిమంటలు, గాలిపటాలు, బొంగరాలు, గోళీలాట నిర్వహించారు. కోలాటం, భరతనాట్యం ఆకట్టుకున్నాయి. వోలేటి సత్యనారాయణ, మోహనకృష్ణ పాల్గొన్నారు.

అబ్దుల్ కలామ్ అవార్డుకు కార్తిక్ ఎంపిక

ప్రకాశం నగర్: ఏటా వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచి, కొత్తతరాన్ని ప్రపంచానికి పరిచయం చేసే ఒయాసిస్ వరల్డ్ రికార్డ్స్ ఈ ఏడాది ఏపీజే అబ్దుల్ కలామ్ అవార్డుకు విద్యార్థి సంఘం నాయకుడు కార్తిక్ ఎంపిక య్యాడు. జనవరి 22 తేదీన దేశ రాజధాని ఢిల్లీలో ఏడు ప్రపంచ దేశాల ప్రతినిధుల సమక్షంలో ఆయనకు అవార్డు ప్రదానం చేస్తారు.

చిత్రమహేంద్రి



నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో గోడలకు వేసిన చిత్రాలు

- నగరంలోని గోడలపై చిత్రాలు
- రూ.కోటితో ఏర్పాటు
- ఆకట్టుకుంటున్న వైనం

రాజమహేంద్రవరం సిటీ: చారిత్రక రాజమహేంద్రవరంలో కోట్లాది రూపాయలతో ఒక వైపు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి, మరోవైపు స్వచ్ఛ రాజమహేంద్రవరం సాధనకు నిస్తేజంగా ఉన్న గోడలకు జీవం ఉట్టిపడేలా రంగురంగుల బొమ్మలు, సప్తవర్ణాలశోభిత చిత్రాలను ఏర్పాటు చేస్తున్నారు. నగరంలో ఏ ప్రాంతంలో గోడలను చూసినా రంగురంగుల చిత్రాలు దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా 20 రహదారుల్లో గోడలకు ఈ విధమైన చిత్రాలను ఏర్పాటు చేసేందుకు నగర పాలక సంస్థ ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. వీటి కోసం సుమారు కోటి రూపాయలు ఖర్చు చేస్తోంది. నగర సుందరీకరణలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంపై ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. టి.నగర్, ఇన్నీసుపేట, చర్చిపేట, నల్లా చానల్, కంబాలచెరువు, ఐఎల్‌టీడీ ఫ్లైఓవర్, తుమ్మలావ తదితర 20 ప్రాంతాలలో గోడలకు ఇలా చిత్రాలు వేస్తున్నారు.









నగరంలో దర్శకుడు బాబీ సందడి



కోటిపల్లి బస్టాండ్ వద్ద దర్శకుడు కొల్లి బాబీని గజమాలతో సత్కరిస్తున్న ఏడిద బాబీ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వాల్తేరు వీరయ్య సినిమా దర్శకుడు కొల్లి బాబీ (కేఎస్ రవీంద్ర) సోమవారం రాజమహేంద్రవరంలో సందడి చేశారు. ఆయన దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి హీరోగా రవితేజ ప్రధాన పాత్రలో, నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించిన వాల్తేరు వీరయ్య ఈనెల 13న విడుదలైన విషయం తెలిసిందే. ఆ సినిమా విజయవంతం కావడంతో ప్రేక్షకులు, అభిమానులు కలుసుకోవడానికి బాబీ నగరానికి విచ్చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి ఏడిద బాబీ ఆధ్వర్యంలో కోటిపల్లి బస్టాండ్ నుంచి భారీ బైక్ ర్యాలీతో కొల్లి బాబీని ఊరేగింపుగా స్వామి థియేటర్‌కు తీసుకువచ్చారు. అక్కడ మార్నింగ్ షో సమయంలో దర్శకుడు బాబీ మాట్లాడుతూ చిరంజీవి అభిమానిగా వాల్తేరు వీరయ్య సినిమాను తీయడం జరిగిందన్నారు. థియేటర్ల వద్ద ప్రేక్షకుల పూనకాలు చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆయనను వింటేజ్ క్రియేషన్స్ శివరామ్, స్వామి థియేటర్ అధినేత పులవర్తి లక్ష్మణస్వామి శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించారు. అనంతరం సంహిత డిగ్రీ కళాశాలలో అభిమానులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఏడిద బాబీ, చిరు అభిమానులు సత్కరించారు. కార్యక్రమంలో ఉదయరాజ్, మెగా అభిమానులు పాల్గొన్నారు.

సముద్ర స్నానానికి వెళ్లి యువకుడి మృతి



ప్రేమ్‌సన్ (ఫైల్)

పాయకరావుపేట: అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలంలోని పెద్దూరు రత్నయ్యమ్మపేట సముద్ర తీరంలో స్నానానికి వెళ్లి యువకుడు మృతి చెందాడు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన త్రిపురాలు ప్రేమ్‌సన్ (19), తొండంగి మండలం కృష్ణాపురంలో తన మేనమామ తిరగట్టి నాని బాబు ఇంటికి వచ్చాడు. అక్కడ నుంచి ఆదివారం సముద్ర తీరంలో స్నానానికి స్నేహితులతో వచ్చాడు. ఈ క్రమంలో స్నానం చేస్తుండగా, సముద్ర అలలు తాకిడికి లోపలికి కొట్టుకుపోయాడు. ఈత రాకపోవడంతో సముద్రంలో గల్లంతయ్యాడు. సోమవారం ఉదయం వెంకటనగరం బీచ్‌లో మృతదేహం లభ్యమైంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కార్మికులతో చర్చలు జరపాలి



దీక్షకు సంఘీభావం తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

ప్రకాశం నగర్: ఏపీ పేపర్ మిల్లు యాజమాన్యం తక్షణమే కార్మికులతో చర్చలు జరిపి, సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పేపర్ మిల్లు యాజమాన్యంపై ఉద్యమ కార్యాచరణ ప్రకటించిన నేపథ్యంలో మిల్లు గేటు ఎదుట చేస్తున్న చేస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం ఆరో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వెంకట్ ఈ దీక్షకు సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ యాజమాన్యం గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించకుండా, వేతన ఒప్పందం చేయకుండా కార్మికుల జీవితాలతో ఆటలాడుతోందని విమర్శించారు. కార్మికులకు టిఫిన్, భోజనంపై ఇస్తున్న రాయితీని తగ్గించి క్యాంటీన్ ధరలు పెంచడం సరికాదన్నారు. పరంపర 2 పేరుతో సీనియర్ కాంట్రాక్ట్ కార్మికులను పక్కన పెట్టి బయటి వ్యక్తులకు ఉద్యోగాలు అమ్ముకోవడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు.

పేద మహిళలకు వస్త్ర, అన్నదానం



వస్త్రదానం చేస్తున్న తుమ్మిడి బ్రదర్స్

రాజమహేంద్రవరం సిటీ: తుమ్మిడి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా సంస్థలకు చేయూతనివ్వడంతో పాటు ధార్మిక, ఉద్యోగ సంఘాలకు వారి విజ్ఞప్తి మేరకు సేవలు నిర్వహిస్తున్నామని ప్రముఖ వస్త్ర వ్యాపారులు తుమ్మిడి బ్రదర్స్ అన్నారు. వారి మాతృమూర్తి తుమ్మిడి జానకమ్మ 92వ జయంతి సందర్భంగా సోమవారం కోటగుమ్మం సెంటర్‌లోని తుమ్మిడి బ్రదర్స్ షోరూంలో ఆమె జ్ఞాపకార్థం వందలమంది మహిళలకు అన్న, వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రే కొండబాబు పాల్గొన్నారు. ఏటా తమ మాతృమూర్తి పేరిట ఈ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నామని తుమ్మిడి విజయ్ కుమార్, తుమ్మిడి అరుణ్ కుమార్, తుమ్మిడి బులి గోవిందరాజు తెలిపారు. కార్యక్రమంలో మార్చుల్ శ్రీనివాస్, తీపర్తి శ్రీనివాస గంగాధరరావు పాల్గొన్నారు.

తొర్రేడులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కార్యక్రమానికి తరలివచ్చిన పూర్వ విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003లో పదో తరగతి చదివిన విద్యార్థులు సుమారు 20 ఏళ్ల అనంతరం సోమవారం పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. స్థానికంగా ఉన్నవారితో పాటు హైదరాబాద్, చెన్నై, ముంబై, బెంగళూరు తదితర దూర ప్రదేశాల నుంచి విద్యార్థులు తరలివచ్చారు. దీంతో పాఠశాలలో సందడి నెలకొంది. తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ప్రభాకర్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోలా సత్యనారాయణ, పూర్వ ప్రధానోపాధ్యాయుడు పి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు సుశీల, కుసుమ, కుమారి, కామేశ్వరి, ఉదయని, ఆనంద కుమారి హాజరయ్యారు. స్థానికంగా ఉన్న ఓల్లేటి మురళీకృష్ణ, గూడపాటి వెంకట దుర్గం, కారంకి ప్రసాద్, నాదెళ్ల గణేష్, సీహెచ్ ఛాయాదేవి, అన్నపూర్ణ, ప్రసన్న తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అదిరిందయ్యా.. ఊదలయ్యా..



మొదటి బహుమతి సాధించిన ముగ్గు వద్ద బహుమతితో ఊదలయ్య

కడియం: సంక్రాంతి పర్వదినం సందర్భంగా కడియపులంక ఎస్సీ కాలనీలో ముగ్గుల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో సుమారు 60 మంది పోటీ పడ్డారు. అయితే విజేతగా గ్రామానికి చెందిన బొచ్చే ఊదలయ్య మొదటి బహుమతి గెల్చుకున్నాడు. అతడు వేసిన ముగ్గు న్యాయనిర్ణేతలను ఆకట్టుకుంది. ద్వితీయ బహుమతిని సిరిపురం హేమలత, తృతీయ బహుమతిని నల్లా ప్రమీల పొందారు. పోటీల్లో పాల్గొన్నవారందరికీ నిర్వాహకులు దళిత చైతన్య యువజన సంఘం, అంబేడ్కర్ యూత్ ప్రోత్సాహక బహుమతులను అందజేసింది. కాగా.. ఆ గ్రామంలోనే ఒక ఫెర్టిలైజర్ షాపులో పనిచేసే ఊదలయ్య స్పష్టంగా మాట్లాడలేడు. వినికిడి సమస్య కూడా ఉంది. కానీ చేసే పనిలో చురుగ్గా ఉంటాడు. ముగ్గులు వేసే వారిని గమనిస్తూ తాను అవగాహన పెంచుకుని ముగ్గు వేశానని, బహుమతి వచ్చిందని ఊదలయ్య ఉత్సాహంగా సైగలతో తెలిపాడు.

కన్నుల పండువగా సంక్రాంతి సంబరాలు



కడియపులంకలో బహుమతులు అందజేస్తున్న ఆకుల వీర్రాజు, బుచ్చయ్య చౌదరి, కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం సిటీ: దేవాంగ సంఘీయులు ఐకమత్యంతో ప్రయత్నిస్తే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి కాలెపు సత్యనారాయణ మూర్తి, గౌరవాధ్యక్షుడు కేకే సంజీవరావు, గౌరవ సలహాదారుడు పడాల వీరభద్రరావు పిలుపు నిచ్చారు. సంక్రాంతిని పురస్కరించుకుని జాంపేట దేవాంగ సంక్షేమ సంఘం, చౌడేశ్వరిదేవి దేవాంగ మహిళా సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జాంపేట గాంధీబొమ్మ సెంటర్‌లో ఆదివారం రాత్రి సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు భోగిపండ్లు పోశారు. మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి గోద్రేజ్ బీరువాను అల్లక అరుణ చంద్రకళ, ద్వితీయ బహుమతి గ్రైండర్‌ను నక్కా గౌరి, తృతీయ బహుమతి మిక్సీని వి.రాధ గెలుచుకున్నారు. మరో పదిమందికి కన్సోలేషన్ బహుమతులు అందించారు. ఈ సందర్భంగా చిన్నారులకు, పురుషులకు ఫ్యాన్సీడ్రెస్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షురాలు అల్లాడ శ్యామలా దేవి, కార్యదర్శి బొమ్మన మాధురి, కోశాధికారి బొమ్మన గౌరీ పార్వతి పాల్గొన్నారు.

కడియపులంకలో..

కడియం: కడియపులంక గ్రామదేవత పుంతలో మునలమ్మ ఆలయం వద్ద సోమవారం నిర్వహించిన రంగవల్లుల పోటీ ఆకట్టుకుంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏటా కనుమ రోజున ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. మహిళలు, యువతులు ఈ పోటీల్లో భారీ ఎత్తున పాల్గొని ముగ్గులు వేసి తమ నైపుణ్యాన్ని చాటారు. రాత్రి జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో విజేతలకు డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి చేతుల మీదుగా విలువైన బహుమతులు అందజేశారు. మొత్తం 250 మంది ఈ పోటీల్లో పాల్గొనగా, వారందరికీ ప్రోత్సాహక బహుమతులను నిర్వాహకులు అందజేశారు. ఆలయ కమిటీ, స్థానిక యువత ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమానికి కడియం ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, స్థానిక ప్రముఖులు మార్గాని సత్యనారాయణ, పల్ల సుబ్రహ్మణ్యం, పుల్ల చినసత్యనారాయణ, తిరుమలశెట్టి శ్రీను, మార్గాని ఏడుకొండలు తదితరులు హాజరయ్యారు.



దేవాంగ సంఘీయుల ముగ్గుల పోటీలు

నగరం.. నిర్మానుష్యం



వై.జంక్షన్‌లో కానరాని వాహనాల రద్దీ




బోసిబోయిన హైటెక్ బస్టాండ్ ప్రాంతం

ప్రకాశం నగర్: సంక్రాంతి నేపథ్యంలో నగరం నిర్మానుష్యంగా మారింది. పండగ సందర్భంగా నగరంలోని పల్లెలకు ప్రజలు తరలివెళ్లారు. అలాగే వివిధ ప్రాంతాల నుంచి వచ్చి నగరంలో ఉంటున్న వారు తమ స్వస్థలాలకు వెళ్లారు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. శుక్రవారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని వై.జంక్షన్, కంబాల చెరువు హైటెక్ బస్టాండ్, దేవీచౌక్, గోకవరం బస్టాండ్ ప్రాంతాల్లో రోడ్డుపై జన సంచారం లేదు.

వైభవంగా దోసాలమ్మ జాతర

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు గ్రామ దేవత దోసాలమ్మ జాతర మహోత్సవాలు సోమవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి అమ్మవారికి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామవీధుల్లో మేళతాళాలు, వాయిద్యాలతో వైభవంగా నిర్వహించారు. బొమ్మూరుకు చెందిన ప్రభుఫైర్‌వర్క్స్ గుత్తుల శ్రీను ఆధ్వర్యంలో బాణసంచా కాల్పులు జరిగాయి.



ప్రత్యేక అలంకరణలో దోసాలమ్మ



అమ్మవారిని ఊయలలో ఊపుతున్న భక్తులు



ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

26 నుంచి బహుజన చైతన్య యాత్ర

ప్రకాశం నగర్: రాజ్యాంగ పరిరక్షణ, రాజ్యాధికారాన్ని సాధించేందుకు ఈ నెల 26 నుంచి బహుజన రాజ్యాధికార చైతన్య యాత్ర నిర్వహిస్తున్నట్లు బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయకుమార్ తెలిపారు. ఆదివారం బీఎస్పీ అధినేత్రి మాయావతి పుట్టినరోజు సందర్భంగా గోకవరం బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద విజయ కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ రూరల్ అధ్యక్షుడు గెద్దం ప్రసాద్, జిత్తుగ రాజేష్, నగర అధ్యక్షుడు మోర్త మోహన్, ఉపాధ్యక్షుడు కోటి పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం

కడియం: వీరవరంలోని ఫెలోషిప్ ప్రెసిడెంట్ ఎం.కరుణాకర్ కల్వరి ప్రార్థనా మందిరంలో సోమవారం మండల పాస్టర్స్ ఫెలోషిప్, క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. కరుణాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పరంజ్యోతి, సెక్రటరీ సీహెచ్ రత్నదీప్ మాట్లాడారు. గౌరవాధ్యక్షుడు రెయిన్ హార్ట్ శుభాలు అందించారు. బిషప్ బత్తిన రాజు వాక్యసందేశం అందించారు. దామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఫెలోషిప్ సభ్యుడు బండి అబ్రహం ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో ఫెలోషిప్ తరఫున రూ. 5 వేల ఆర్థిక సాయం అందజేశారు.

18 నుంచి సీపీఐ పోరుబాట

ప్రకాశం నగర్: టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని కోరుతూ ఈ నెల 18 నుంచి సీపీఐ పోరుబాట నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఇళ్ల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలను రూ. ఐదు లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. 18 నుంచి 30 వరకు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి సంతకాల సేకరణ చేస్తామన్నారు. జనవరి 30న రౌండ్‌టేబుల్ సమావేశం, ఫిబ్రవరి 6న కలెక్టరేట్ వద్ద ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కోండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు, సహాయ కార్యదర్శి చప్ప రమణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నక్కపల్లి: అనకాపల్లి జిల్లా నక్కపల్లి ఆర్చి వద్ద జాతీయ రహదారిపై సోమవారం రాత్రి గుర్తు తెలియని కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఒక యువకుడు దుర్మరణం చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. రాజమహేంద్రవరానికి చెందిన ఇద్దరు యువకులు మోటారు సైకిల్‌పై విశాఖపట్నం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో సోమవారం సాయంత్రం నక్కపల్లిలో ఉపమాక రోడ్డు ఆర్చి వద్దకు చేరుకునే సరికి వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న జుబెరుద్దీన్ (16) అక్కడికక్కడే మరణించాడు. సయ్యద్ ఆలీ గాయపడ్డాడు. ఇతడిని నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

సినిమాలు

శ్యామల	వారసుడు
సూర్యమినీ	కల్యాణం కమనీయం
సూర్యప్యాలెస్	వీరసింహారెడ్డి
స్వామి	వాల్తేరు వీరయ్య
శివజ్యోతి	వాల్తేరు వీరయ్య
అనుశ్రీ	వాల్తేరు వీరయ్య
రాజా	వాల్తేరు వీరయ్య
కుమారి	వీరసింహారెడ్డి
ఊర్వశి	వీరసింహారెడ్డి
రంభ	వారసుడు
మేనక	తెగింపు
అశోక	వీరసింహారెడ్డి
గీతాఅప్సర	వాల్తేరు వీరయ్య
నామవరం	
వీఎస్ మహల్	వాల్తేరు వీరయ్య
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	వాల్తేరు వీరయ్య
కడియం	
వెంకట సూర్య	వాల్తేరు వీరయ్య